నామినేషన్ల వివరాలు.. 2వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
సిరిసిల్ల	01	01
వేములవాడ	00	00



రాజన్నకు మొక్కులు



వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో 7 నుంచి కేసీఆర్ పర్యటన

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. విపక్షాల కంటే ఎన్నికల ప్రక్రియలో ఒక అడుగు ముందుండేలా వ్యూహం అమలుచేస్తోంది. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ బాస్ ఎన్నికల ప్రచారమూ ముమ్మరం చేశారు. ఇప్పటికే కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పలు నియోజకవర్గాలను చుట్టేశారు. రెండో విడతలో మిగతా నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సభలు ఇలా..

తేదీ	నియోజకవర్గం
7న	మంథని, పెద్దపల్లి
17న	కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్
20న	మానకొండూరు
24న	రామగుండం
26న	జగిత్యాల, వేములవాడ

అందరికీ న్యాయసేవలు

- జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: జిల్లా న్యాయసేవాసమితి ద్వారా పేదలకు ఉచిత న్యాయసేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. చట్టాలు తెలియక చాలా మంది కేసుల్లో ఇరుక్కుంటున్నారన్నారు. అందరికీ చట్టాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు ఎలాంటి న్యాయసేవలు అవసరం ఉన్నా లీగల్‌సెల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. నవంబర్ 9న న్యాయసేవా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మంత్రి కేటీఆర్ వేములవాడ రాక



పోస్టర్ విడుదల చేస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

వేములవాడ: వేములవాడలో విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించే యువగర్జనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈమేరకు యువగర్జన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈర్లపల్లి రాజు, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, గోలి మహేశ్, నిమ్మశెట్టి విజయ్, గుండె కారుల నరేశ్, మంద రాజేందర్, వనపట్ల సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సిరిసిల్లఅర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక తదితర రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాయకులు దేవయ్య, నర్సింగారావు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ ఆఫర్

సిరిసిల్లటౌన్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో ఈనెల 27న కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డీఎం మురళీకృష్ణ తెలిపారు. 25న వేములవాడ నుంచి బయలుదేరి 26న అరుణాచలం చేరుకుంటుందని, 27న అక్కడి నుంచి బయలుదేరి 28వ తేదీ వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.4,500, పిల్లలకు రూ.3,400 టిక్కెట్ ఉంటుందని, వివరాలకు 99592 5926, 73828 51826లలో సంప్రదించాలని కోరారు.

భవిష్యత్‌కు భరోసా ఇవ్వండి

- పోటీపరీక్షల నిర్వహణ సంస్థను ప్రక్షాళించాలి
- స్థానికంగా కంపెనీలు ఏర్పాటు చేయాలి
- అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టాలి
- స్కాలర్‌షిప్స్ అందించాలి
- 'సాక్షి' డిబేట్‌లో విద్యార్థులు



సాక్షి నిర్వహించిన చర్చావేదికలో పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

సాక్షి చర్చావేదిక

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడడంతో బరిలో ఉన్న పార్టీలు తమ.. తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అధికారంలోకి వస్తే తాము ఏమేమి చేస్తామో ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో చర్చావేదిక నిర్వహించింది. ఈ చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థులు రాబోయే తరం బాగుపడాలంటే ప్రభుత్వాలు ఏం చేయాలో స్పష్టంగా తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు భవిష్యత్‌పై భరోసా కల్పించాలని కోరారు. పోటీపరీక్షల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని కోరారు. ఈ చర్చావేదికలో సాక్షి ప్రతినిధులు ఊరడి మల్లికార్జున్, పాలమాకుల శేఖర్, భూమేశ్, కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలిపిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలి



ఆడపిల్లలను పొరుగు ప్రాంతాలకు పంపించే పరిస్థితులు లేవు. ఉన్నత విద్య కోసం, ఉపాధి మార్గాల అన్వేషణ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. కాబట్టి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేయాలి. విద్యార్హతలకు తగిన రీతిలో ఉద్యోగాలు ఇచ్చే కంపెనీల స్థాపనపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– మ్యాన అనూష, డిగ్రీ విద్యార్థిని

పోటీపరీక్షల నిర్వహణను ప్రక్షాళన చేయాలి



నిరుద్యోగుల పాలిట కల్పతరువులా ఉండాల్సిన టీఎస్ పీఎస్సీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలి. పోటీపరీక్షలు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షల నిర్వహణలో లోటుపాట్లతో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాటు చేయాలి.

– జయమూర్తి మీనాక్షి, డిగ్రీ విద్యార్థిని

గ్రూప్స్ పరీక్షల్లో అవకతవకలు సరిదిద్దాలి



ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహణలో ప్రభుత్వాలు అభాసుపాలవుతున్నాయి. అక్రమార్కులకు అవకాశాలు ఇవ్వడంతో సంబంధిత సంస్థ పారదర్శకతపై అనుమానాలున్నాయి. ఉన్నత విద్యార్హతలు గల యువత నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. పేపర్ లీకేజీలు, వాయిదాలతో ఏళ్లుగా కోచింగ్‌సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వ్యవస్థను మార్చాలి.

– గాలి వైష్ణవి, డిగ్రీ విద్యార్థిని

నకిలీలకు చెక్ పెట్టాలి



ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది జీతాలు తీసుకుంటున్న వారి విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అర్హులకు న్యాయం జరిగేలా చూడాలి. నిరుద్యోగ నిర్మూలనకు నిర్మాణాత్మక ప్రణాళికలు రూపొందించాలి.

– ఆడం మహాలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని

రేపటితరంపై శ్రద్ధ పెట్టాలి



రేపటితరం భవిష్యత్‌పై ప్రభుత్వాలు ముందుచూపుతో వ్యవహరించాలి. పరీక్షాపత్రాల రూపకల్పనలో జరుగుతున్న పొరపాట్లతో విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రశ్నల తొలగింపు, తప్పు ప్రశ్నలకు మార్కులను కలపడం వంటి దిద్దుబాటు చర్యలతో ఫలితాలు తారుమారవుతున్నాయి. దీంతో చాలా మంది నష్టపోతున్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో పొరపాట్లకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

– తన్నీరు లీలావతి, డిగ్రీ విద్యార్థిని

ఆత్మహత్యలు లేని సమాజం కావాలి



సామాజిక, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలు పెరుగుతుండడం బాధాకరం. అన్ని వర్గాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఇంటికి పని కల్పించేలా ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలకు ఊతం ఇవ్వాలి. ఉద్యోగాల కల్పనకు అవసరమైన నైపుణ్యాలను, ఆర్థిక తోడ్పాటునందించాలి. ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మించాలి.

– పత్తిపాక నరేంద్ర, డిగ్రీ విద్యార్థి

అగ్రవర్ణ పేదలను ఆదుకోవాలి



అగ్రవర్ణాలుగా పిలుచుకునే ప్రజల్లోనూ పేదలున్న విషయాన్ని ప్రభుత్వం సర్వేల ద్వారా గుర్తించాలి. ఓసీల పేరుతో పేద విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు దూరం చేస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. అంతరాలతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి ఉపకార వేతనం అందించాలి. ఉద్యోగాల క్యాలెండర్ ఉండాలి.

– మీసం రమ్య, డిగ్రీ విద్యార్థిని

అందరికీ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకుంటున్న విద్యార్థుల విషయంలో ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. విద్యా సంవత్సరం ముగిసేలోపు ఆర్టీఎఫ్‌లు, ఎంటీఎఫ్‌లు సకాలంలో అందేలా చూడాలి. ఫస్టియర్ స్కాలర్‌షిప్ సెకండియర్ ముగిసినా రావడం లేదు. దీంతో చదువు అయ్యాక సర్టిఫికెట్లు తీసుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. స్కాలర్‌షిప్స్ అందరికీ అందాలి.

– తిమ్మనగారి మేఘన,డిగ్రీ విద్యార్థిని

హలో.. నేను కేటీఆర్‌ను మాట్లాడుతున్నా..

- సిరిసిల్లలోని ప్రముఖులకు మంత్రి ఫోన్లు
- ప్రభావవర్గాలతో నేరుగా మాట్లాడుతున్న కేటీఆర్



మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు సిరిసిల్ల ప్రాంతవాసులతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. పది మందిని ప్రభావితం చేసే సత్తా ఉన్న వారితో కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే నేరుగా మంత్రి నుంచి కాల్ వస్తుంది. తనను తాను పరిచయం చేసుకుంటూ ఎన్నికల్లో సహకరించాలని కోరుతుండడం విశేషం. ఉద్యమంలో అందరితో కలిసి పనిచేసిన సంగతులను గుర్తు చేస్తున్నారు. 2014 తర్వాత సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన అభివృద్ధి.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఏర్పాటు.. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని కోరడం విశేషం. రాష్ట్ర స్థాయి పార్టీ బాధ్యతలు, మంత్రి బాధ్యతల నేపథ్యంలో గత ఐదేళ్లుగా కలువలేక పోయినందుకు బాధపడుతున్నానని చెబుతూ.. ముందుకెళ్లినట్లు సమాచారం. ఈసారి ఎన్నికల్లో మీ వాళ్ల అందరితోనూ కారు గుర్తుకు ఓట్లు వేయించాలని, పెద్దసారు (కేసీఆర్)మూడోసారి ముఖ్య మంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంతోపాటు నియోజకవర్గంలోని మిగతా ప్రాంతాల్లోని పాత మిత్రులు, కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న వారితో నేరుగా కేటీఆర్ మాట్లాడుతున్నారు.

బిజీ షెడ్యూల్‌లోనూ..

మంత్రి కేటీఆర్ ఎన్నికల బిజీలో ఉంటూనే స్థానిక నాయకులతో ఫోన్‌లో మాట్లాడుతూ పాతసంగతులు గుర్తు చేసుకుంటుండడంతో స్థానిక నాయకులు ఆనందానికి గురవుతున్నారు. ఎన్నికల్లో అండగా ఉండాలని, భవిష్యత్‌కు నేను భరోసా అంటూ.. సిరిసిల్లకు వచ్చినప్పుడు తప్పకుండా కలుద్దామని చెప్తుండడంతో అందరూ కూల్ అవుతున్నారు. మంత్రి కేటీఆర్ ఫోన్ చేసిన విషయాన్ని గోప్యంగా సన్నిహితులు, ఆత్మీయులతో పంచుకోవడం విశేషం.

షాడో రిజిస్టర్ నిర్వహించాలి

- ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి



పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన పటికబెల్లం పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు

సిరిసిల్ల: అభ్యర్థులు చేసే ఖర్చులపై షాడో రిజిస్టర్ నిర్వహించాలని రాజన్నసిరిసిల్ల ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఎన్నికల వ్యయపరిశీలనపై సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి రూ.40 లక్షల వ్యయ పరిమితి ఉందని.. అభ్యర్థుల రోజువారీ వ్యయంపై రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, అకౌంటింగ్ బృందాల పనితీరును కలెక్టర్ వివరించారు.

మీడియా సెంటర్ సందర్శన

కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్, మీడియాసెంటర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి పరిశీలించారు. ఉల్లంఘనలపై 1950 టోల్‌ఫ్రీ నంబర్, సీ విజిల్ యాప్, కంట్రోల్ రూమ్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇస్తూ పరిష్కరిస్తున్నామని కలెక్టర్ వివరించారు. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, ఎన్నికల వాహనాల మూవ్‌మెంట్‌ను జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, నోడల్ అధికారి రామకృష్ణ, ఆడిట్ అధికారి స్వప్న, సీపీవో శ్రీనివాసాచారి, డీపీఆర్వో దశరథం, లేబర్ ఆఫీసర్ రఫీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, జౌళిశాఖ ఏడీ సాగర్ తదితరులు ఉన్నారు.

పటిక బెల్లం పట్టివేత

కామారెడ్డి నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న 15 కిలోల పటికబెల్లంను చెక్‌పోస్టు అధికారులు శనివారం పట్టుకున్నారు. ఆ పటికబెల్లం ఎవరిదో ప్రయాణికులు చెప్పకపోవడంతో చెక్‌పోస్ట్ వద్దకు తెచ్చారు. అక్కడే ఉన్న ఎన్నికల వ్యయపరిశీలకుడు మణిగండసామి పటిక, బెల్లాన్ని పరిశీలించి సీజ్ చేయాలని ఆదేశించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- రుద్రంగి చెక్‌పోస్టు తనిఖీ



రుద్రంగిలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రుద్రంగి(వేములవాడ): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. రుద్రంగిలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే సరైన పత్రాలు ఉండాలని సూచించారు. అనంతరం రుద్రంగి, మానాల, బడితండా, దెగావత్‌తండా పోలీంగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, రుద్రంగి ఎస్సై రాజేశ్ ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

చందుర్తి(వేములవాడ): ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. చందుర్తి మండలం మల్యాలలోని పోలింగ్ కేంద్రాన్ని శనివారం సాయంత్రం పరిశీలించారు. ప్రజలు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివాదాస్పదులను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్, చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్ ఉన్నారు.

జిల్లాలో నామినేషన్ల బోణీ

- సిరిసిల్లలో ఒకే ఒక్క నామినేషన్
- వేములవాడలో నిల్
- నామినేషన్ల స్వీకరణకు నేడు సెలవు



నామినేషన్ వేస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్ల: జిల్లాలో రెండో రోజు శనివారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. సిరిసిల్లలో స్వతంత్ర అభ్యర్థిగా లగిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. తొలిరోజు శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండో రోజు సిరిసిల్లలో బోణీ కొట్టింది. బీజేపీ టిక్కెట్ ఆశించి భంగపడిన లగిశెట్టి శ్రీనివాస్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నలుగురితో కలిసి వచ్చి సాదాసీదాగా నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఎస్.ఆనంద్‌కుమార్‌కు అందించారు. మరో నామినేషన్ సెట్‌ను అనుచరులతో వచ్చి వేస్తానని తెలిపారు. వేములవాడలో రెండో రోజు కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం నామినేషన్లు స్వీకరించనున్నారు.

అంతే పోలీస్ భద్రత

సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌ల వద్ద మూడంచెల భద్రతను శనివారం కొనసాగించారు. వాహనాలను వన్ వేలో నియంత్రించారు. సామన్యులు ఎవరూ రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లోకి వెళ్లకుండా పోలీసులు కట్టడి చేశారు. కట్టుదిట్టమైన సాయుధ పోలీస్ భద్రత మధ్య నామినేషన్ల స్వీకరణ కొనసాగింది.

బీఆర్ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు, మహిళలు

సిరిసిల్లటౌన్: రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తున్నందునే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం బీఆర్ఎస్‌కే ఉందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. స్థానిక 26వ వార్డు నుంచి 150 మంది మహిళలు, బీజేపీ నుంచి 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా.. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావులతో కలిసి కండువాలు కప్పారు. రానున్న ఎన్నికల్లో వార్డు నుంచి ప్రతిపక్షాలకు ఓట్లు పోకుండా అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌కు వేస్తే ఒనగూరే లాభాలను ఇంటింటా ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ దళిత మోర్చా పట్టణాధ్యక్షుడు పెరుమాండ్ల ప్రవీణ్, బీజేపీ కార్యదర్శి కొంపెల్లి రాజేందర్, సిరిగిరి అనిల్, సిరిగిరి విజయ్‌తోపాటు పార్టీలోకి వచ్చిన వారిని అభినందించారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు దిడ్డి శ్రీనివాస్, రాగుల జగన్, అన్నల్‌దాస్ వేణు, మ్యాన రవి, మల్లడపేట భాస్కర్ పాల్గొన్నారు.

- కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- గులాబీ కండువాలు కప్పుకున్న బీజేపీ నాయకులు

మీకు తెలుసా?

0 శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు స్థానమివ్వని నియోజకవర్గం చొప్పదండి. ఇక్కడ 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు పోటీ చేసినా ఓట్లను రాబట్టుకోలేకపోయారు.

1 ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరే అత్యున్నత ప్రధానమంత్రి పీఠం అధిష్టించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పాములపర్తి వెంకట నర్సింహారావు మంథని ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలుపొందగా హన్మకొండ, రాంటెక్, ఒడిశా, నంద్యాల నుంచి ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి పదవిని నిర్వహించి దేశవ్యాప్త కీర్తి గడించారు.

ఉమ్మడి కరీంనగర్ చరిత్రలో ఒకరే ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ధర్మారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

2 ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటకు చెందిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా రెండుసార్లు వ్యవహరించగా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా చరిత్రలో మహిళా ఎమ్మెల్యేలుగా గెలిచింది ఇద్దరే. మెట్‌పల్లి నుంచి కొమొరెడ్డి జ్యోతి, చొప్పదండి నుంచి బొడిగె శోభ.

3 ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు పౌరసరఫరాల శాఖ మంత్రులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ సివిల్ సప్లయ్ మినిష్టర్‌లుగా వ్యవహరించారు.

4 ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఎంపీగా గెలిచిన అరుదైన వ్యక్తిగా పీవీ నర్సింహారావు సత్తాచాటారు. నాలుగుచోట్ల నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు. తొలుత హన్మకొండ నుంచి ఎంపీగా గెలుపొందగా తదుపరి జరిగిన ఎన్నికల్లో రాంటెక్, నంద్యాల, ఒడిశా నుంచి గెలుపొందారు.

నలుగురు తండ్రీ కొడుకులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కేసీఆర్, అతని కుమారుడు కేటీఆర్, శ్రీపాదరావు ఇతని కుమారుడు శ్రీధర్‌బాబు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఇతని కుమారుడు రమేశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, అతని తనయుడు సతీశ్‌కుమార్ ఎమ్మెల్యేగా వ్యవహరించారు.

– కరీంనగర్ అర్బన్

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కళాకారులు

వేములవాడ/వేములవాడఅర్బన్: తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర అమోఘమని, రాష్ట్ర సాధన తర్వాత కళాకారులకు అన్యాయం జరిగిందని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక నృత్య కళానికేతన్ సేవాసంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం కళాకారులను కలిశారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇచ్చి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, బొడ్డు రాములు, వారాల దేవయ్య, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కోనరావుపేటవాసికి ఓయూ డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సుమన్

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన యాస సుమన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'తెలంగాణ ప్రాంతంలోని మాలల సామాజిక ఆర్థిక జీవన విధానం, చారిత్రక నేపథ్యం' అనే అంశంపై సుమన్ చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, అడోబ్ సీఈవో శంతాన్ నారాయణ్ చేతుల మీదుగా అందుకున్నారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: జిల్లా ఆల్‌స్టైల్స్ మార్షల్స్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొల్లి రాంమోహన్, అధ్యక్షుడిగా నీరగంటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిబాబు, కోశాధికారిగా విక్రం, ఉపాధ్యక్షులుగా రాజేందర్, శ్రీనివాస్, సమ్మయ్యలను ఎన్నుకున్నారు.

హుండీ దొంగకు ఏడాది జైలు

రుద్రంగి(వేములవాడ): మండలంలోని గైదిగుట్టతండాలోని హనుమాన్ ఆలయంలోని హుండీని ఆగస్టు 3న దొంగిలించిన వ్యక్తికి ఏడాది జైలు విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. తంగళ్లపల్లి మండలానికి చెందిన సూర దేవేందర్‌ను ఎస్సై రాజేశ్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో సిరిసిల్ల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ ఏడాది సాధారణ జైలు, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం అడ్డుకున్న పోలీసులు

బోయినపల్లి(చొప్పదండి): భార్యాభర్తల మధ్య గొడవతో మనస్థాపం చెందిన ఓ వివాహిత మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు కాపాడారు. బోయినపల్లి ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు. వేములవాడ మండలానికి చెందిన వివాహిత ఇంట్లో జరిగిన గొడవలతో మనస్థాపానికి గురై తన స్కూటీపై కూతురును తీసుకుని కొదరుపాక మిడ్‌మానేర్ పరిసరాలకు చేరుకుంది. ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేందర్ స్పందించి సంఘటన స్థలానికి సిబ్బందితో వెళ్లి వివాహితను కాపాడారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మృతిపై అనుమానాలు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన లేచెర్ల ప్రకాశ్(48) మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశ్ శనివారం మృతిచెందగా.. దహనం చేశారు. ప్రకాశ్‌ది సహజమరణం కాదని స్థానికంగా చర్చ జరిగింది. దీంతో మృతదేహాన్ని దహనం చేసిన వైకుంఠదామం మున్సిపల్ పరిధిలో ఉండడంతో సంబంధిత అధికారులు పంచనామా చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి కావడంతో ఆదివారం పంచనామాను వైద్యాధికారులు, పోలీసుల సమక్షంలో చేయనున్నారు. ఈ విషయాన్ని సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా వ్యక్తి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. సందేహాల నివృత్తికి పోస్టుమార్టం చేస్తేనే తెలుస్తాయని తెలిపారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. ప్రజాచైతన్యం

- 2009లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడిన వేములవాడ
- పునర్విభజనలో మారిన భౌగోళిక చిత్రం
- నాటి సిరిసిల్లలో వరుసగా గెలిచిన వారు లేరు
- విడిపోయాక వేములవాడలో నాలుగు సార్లు ఒక్కరినే వరించిన విజయం

వేములవాడ: రాజన్న క్షేత్రంగా వెలుగొందుతున్న వేములవాడ పేరు ఇప్పుడు చట్టసభలో మారుమోగుతోంది. సిరిసిల్ల నుంచి విడివడి కొత్త మండలాలతో జత కట్టిన వేములవాడ పునర్విభజనలో భాగంగా 2009లో నూతన నియోజకవర్గంగా పురుడు పోసుకుంది. పాత తాలూకాగా పెద్ద విస్తీర్ణం కలిగి, మరో నాలుగు మండలాలను కలుపుకుని శాసనసభ నియోజకవర్గంగా పరిణామం చెందింది. దక్షిణ కాశీగా పేరుగాంచడమే కాకుండా రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు గడించిన వేములవాడకు నియోజకవర్గం గుర్తింపు రావడంతో రాజన్న క్షేత్రానికి మహర్దశ పట్టింది.


వేములవాడ పట్టణం, రాజన్న గుడి


సీహెచ్ రాజేశ్వర్‌రావు


వి.మోహన్‌రెడ్డి


ఎన్‌వీ కృష్ణయ్య


రేగులపాటి పాపారావు


సీహెచ్ రమేశ్‌బాబు

వేములవాడ నియోజక వర్గ సమాచారం

మొత్తం ఓటర్లు	2,19,190
పురుషులు	1,05,426
మహిళలు	1,13,734
ఇతరులు	30



వేములవాడ నియోజకవర్గం మ్యాప్

నియోజకవర్గం ఇలా..

2009లో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంగా అవతరించింది. కొత్తగా వేములవాడ, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలతో అసెంబ్లీ నియోజకవర్గంగా కొనసాగుతుంది.

వేములవాడ చరిత్ర

నియోజకవర్గ కేంద్రమైన వేములవాడ దక్షిణకాశీగా ప్రసిద్ధి. రోజూ కనీసం 10 వేల మందికి తగ్గకుండా ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఈ సెగ్మెంట్ పరిధిలో అత్యధిక ప్రజల జీవనాధారం వ్యవసాయం. సాగుకు అవసరమైన వనరులు ఉన్నా ఉపాధి కోసం యువత గల్ఫ్ వెళ్తుంటారు.

ఐదేళ్లకో చారిత్రక మైలురాయి

1952లో సిరిసిల్ల నియోజకవర్గంగా రూపొందిన తర్వాత అప్పటి నుంచి మొన్నటి వరకు వేములవాడ ఆ నియోజకవర్గంలో ఉంటూనే ప్రత్యేక స్థానం కోసం పాకులాడింది. పార్టీ ఏదైనా ఈ నియోజకవర్గం నుంచి హేమాహేమీలు పోటీ చేసి గెలుపొందడమే కాకుండా ఓటమిని సైతం చవిచూసినవారున్నారు. రాజకీయంగా చైతన్యంతో ఈప్రాంత ప్రజలు ముందున్నారనడంతో అతిశయోక్తి లేదు. సిరిసిల్ల నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత అప్పటి నుంచి 2004 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా గెలిచిన అభ్యర్థి లేరు. 1952లో పీడీఎఫ్ అభ్యర్థి జె.ఆనందరావు, 1957లో అమృతలాల్ శుక్లా (పీడీఎఫ్), 1962లో జె. నర్సింగారావు (కాంగ్రెస్), 1967లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1972లో జె.నర్సింగారావు (కాంగ్రెస్), 1978లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1983లో వి.మోహన్‌రెడ్డి (టీడీపీ), 1985లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1989లో ఎన్‌వీ.కృష్ణయ్య (జనశక్తి), 1994లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1999లో ఆర్.పాపారావు (కాంగ్రెస్), 2004లో సీహెచ్ రాజేశ్వర్‌రావు (టీడీపీ) గెలుపొందారు.

ఆవిర్భావం నుంచి ఒక్కరే..

వేములవాడ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో రమేశ్‌బాబు ఒక్కరే గెలుస్తూ వచ్చారు. 2009లో రమేశ్‌బాబు టీడీపీ నుంచి పోటీ చేసి ఆది శ్రీనివాస్‌పై 1,800 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2010లో జరిగిన ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి రమేశ్‌బాబు పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 25 వేల మెజార్టీతో గెలిచారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి రమేశ్‌బాబు పోటీ చేసి బీజేపీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 5 వేల ఓట్లతో, 2018లో మళ్లీ టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 15 వేల ఓట్ల మెజార్టీ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్ నుంచి ఆది శ్రీనివాస్, బీఎస్పీ నుంచి గోలి మోహన్ పోటీ పడుతుండగా, బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు.

ప్రస్తుత పరిస్థితి

2009లో నియోజకవర్గంగా ఆవిర్భవించిన వేములవాడలో ఆది శ్రీనివాస్ నాలుగుసార్లు ఓడిపోయి తన భవిష్యత్‌ను మరోసారి పరీక్షించుకోనున్నారు. ఇక బీఆర్‌ఎస్ నుంచి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బరిలో ఉండగా, గతంలో కరీంనగర్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమిని చవిచూశారు. ఈసారి తన రాజకీయ భవిష్యత్‌ను చక్కదిద్దుకునేందుకు వేములవాడ నుంచి బరిలో నిలిచారు. ఇద్దరికీ చావోరేవో అన్నచందంగానే ఈ ఎన్నికలు ఉన్నాయన్న వాదన వినిపిస్తోంది. అయితే ఆది శ్రీనివాస్‌కు సానుభూతి పని చేస్తుందా..?, లక్ష్మీనర్సింహారావును ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆదరిస్తాయా వేచి చూడాల్సిందే. బీజేపీ నుంచి డాక్టర్ వికాస్‌రావు, తుల ఉమ టికెట్ రేసులో ఉన్నారు.

నిబంధనలతో వ్యాపారుల తిప్పలు


నామినేషన్ల సందర్భంగా రోడ్ బ్లాక్ చేసిన దృశ్యం

వేములవాడ: వేములవాడ మండల పరిషత్ ఆవరణలోని తహసీల్దార్ ఆఫీస్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు రోడ్డు బ్లాక్ చేస్తున్నారు. దీంతో వ్యాపారులు దుకాణాలను మూసివేయాల్సి వస్తుంది. శుభముహూర్తాలు ఉండడం.. పెళ్లిళ్ల సీజన్ ఊపందుకోవడంతో మధ్యాహ్నం 3 గంటల వరకు తమ దుకాణాలు మూసివేస్తుండడంతో గిరాకీ దెబ్బతింటుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు శనివారం స్థానిక వ్యాపారులు ఎన్నికల అధికారిని కలసి విన్నవించారు. కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి


సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడంతోనే సంక్షేమ పాలన అందడం గ్యారంటీ అని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో శనివారం గడపగడపకు ప్రచారం చేపట్టారు. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటికెళ్లి వివరించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ వరకు చిరువ్యాపారులతో ముచ్చటిస్తూ ప్రచారం చేపట్టారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


జిల్లెల్లలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రైతులు వరిపంట కోసి నెల రోజులకు దగ్గర పడుతున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు విమర్శించారు. మండలంలోని సారంపల్లి, నేరెళ్ల, జిల్లెల్ల ఐకేపీ సొసైటీ కేంద్రాలను శనివారం పరిశీలించి మాట్లాడారు. క్వింటాల్ ధాన్యానికి రూ.200 నుంచి రూ.250 తక్కువకు కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. కేంద్రాల వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. పంతం రవి, శంకర్, రామచందర్, ఆనంద్, బాలరాజు, రాములు, మల్లయ్య పాల్గొన్నారు.

కోర్టుకు గైర్హాజరైన వ్యక్తి రిమాండ్


రిమాండ్ చూపుతున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓ మహిళను వేధించిన కేసులో కోర్టుకు హాజరవకుండా తప్పించుకుంటున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. స్థానిక ఠాణాలో శనివారం వివరాలు వెల్లడించారు. మొగిలి సురేష్ అనే వ్యక్తి 2017లో ఓ మహిళను వేధించిన కేసులో నిందితుడు. కేసు విచారణకు నిందితుడు కోర్టుకు సహకరించకుండా గైర్హాజరవడంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను న్యాయస్థానం జారీ చేసింది. దీంతో నిందితుడు సురేష్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. వారెంట్ పెండింగ్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ న్యాయస్థానంలో హాజరవ్వాలని ఎస్సై సూచించారు.

హాస్టళ్లలో వసతులు కరువు

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్


పరదాలతో సిరిసిల్లలోని బీసీ గురుకుల హాస్టల్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని చాలా గురుకుల హాస్టళ్లలో మౌలిక వసతులు కరువయ్యాయని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ఆరోపించారు. సిరిసిల్ల సమీపంలోని పెద్దూరు శివారులోని బీసీ గురుకుల వసతిగృహాన్ని శనివారం విజిట్ చేసిన సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని పలు వసతిగృహాల్లో గదుల్లేక భవనాలకు పరదాలు కట్టినట్లు తెలిపారు. చలికి వణుకుతూ ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని కోరారు. లోపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

యువ ఆత్మీయ సభను విజయవంతం చేయండి

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ఈనెల 6న నిర్వహించే యువ ఆత్మీయ సభను విజయవంతం చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. సభ స్థలంలో చేస్తున్న ఏర్పాట్లను శనివారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రైవేట్ కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో యువత స్కిల్ డెవలప్మెంట్ కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎల్లారెడ్డిపేటలో రెండు డిగ్రీ కళాశాలలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. యువ సమ్మేళనానికి పెద్ద ఎత్తున యువత, పార్టీ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మండలాధ్యక్షుడు కృష్ణహరి, నాయకులు కృష్ణారెడ్డి, కిషన్, రమేశ్, బాల్‌రెడ్డి, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా లేని పథకాలు రాష్ట్రంలో అమలు


- చల్మెడ లక్ష్మీనర్సింహారావు


మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. మండలంలోని నిమ్మపల్లి, గొల్లపల్లి (నిమ్మపల్లి), వెంకట్రావుపేట, ఎగ్లాస్‌పూర్, శివంగాలపల్లి, కోనరావుపేటల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధిని చూస్తుంటే ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారన్న నమ్మకం కలుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఎంపీపీ చంద్రయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, మాజీ ఎంపీపీ మ్యాకల రజిని, మహిళా విభాగం నాయకులు సంధ్య, వినోద, యూత్ నాయకులు జీవన్‌గౌడ్, నాయకులు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్


మూలవాగు బ్రిడ్జిపై వాహనాల తనిఖీలో ఎస్పీ

వేములవాడ: ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. పట్టణంలోని మూలవాగు బ్రిడ్జిపై శనివారం రాత్రి వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, కేంద్ర బలగాలు, స్పెషల్‌ఫోర్స్ పాల్గొన్నారు.

కొదురుపాకలో కొండూరి వాహనం తనిఖీ


కొదురుపాకలో కొండూరి వాహన తనిఖీ

బోయినపల్లి(చొప్పదండి): కరీంగనగర్ నుంచి సిరిసిల్ల వెళ్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు వాహనాన్ని శనివారం సాయంత్రం కొదురుపాక చెక్‌పోస్టు వద్ద ఎస్సై మహేందర్, ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. కారులో లోపల, డిక్కీలో సోదాలు చేశారు.

పల్లెల్లో కవాతు


మామిడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామీణులు సహకరించాలని కోరుతూ చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, గొల్లపల్లి(వట్టిమల్ల), మరిమడ్ల గ్రామాల్లో శనివారం కేంద్ర పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈనెల 30న పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు గ్రామీణులు సహకరించాలని కోరారు. ఎస్సై ఆంజనేయులు, బీఎస్‌ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గాల ఇన్‌చార్జిల నియామకం

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులను నియమించిందని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గానికి సలీం అహమద్, చొప్పదండికి రూపకల, మానకొండూరుకు బసనగౌడ దద్దల్, హుస్నాబాద్‌కు సునీల్‌గౌడ పాటిల్, ధర్మపురికి బసనగౌడ తుర్విహాల్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

విలీన గ్రామాలను పంచాయతీలు చేస్తాం


రగుడు నుంచి పాదయాత్రలో రాణీరుద్రమ, బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: బీజేపీ అధికారంలోకి రాగానే సిరిసిల్లలో విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మారుస్తామని ఆ పార్టీ సిరిసిల్ల అభ్యర్థిని రాణీరుద్రమ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఒకటోవార్డు రగుడు చౌరస్తా నుంచి ప్రజా ఆశీర్వాద పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా మంత్రిగా ఉండి కేటీఆర్ సిరిసిల్ల ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సిరిసిల్ల నుంచి పోటీచేస్తున్న తనను ఆడబిడ్డగా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే ప్రజల కష్టాలు తీరుస్తానన్నారు. అభివృద్ధి ఏంటో చూపిస్తామన్నారు. మహిళా రిజర్వేషన్ తీసుకురావడమే కాకుండా అత్యధిక సీట్లను కేటాయించి, బీసీలను ముఖ్యమంత్రి చేస్తామన్న ఏకైక పార్టీ బీజేపీగా చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరుతూ రగుడు, చంద్రంపేట, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, రెడ్డివాడ, రాళ్లబావి, పెద్దబజార్, రాళ్లబావి ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి ప్రజలను నేరుగా కలుసుకుంటూ ప్రచారం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆడెపు రవీందర్, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, రెడ్డబోయిన గోపి, మహిళా అధ్యక్షురాలు బర్కం లక్ష్మియాదవ్, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రాజాసింగ్, గరిపెల్లి ప్రభాకర్, శిరస్వాల్ కైలాశ్, ఎనగంటి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.